క్లుప్తంగా

పెరటికోళ్ల యూనిట్ల పంపిణీ



మహిళలకు పెరటికోళ్ల యూనిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు సమాఖ్య కార్యాలయం ఆవరణంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటికోళ్ల యూనిట్లును శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలం వ్యాప్తంగా 50 సంఘాల్లోని మహిళలకు 50 యూనిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. మహిళలు ఇంటి వద్దే ఉంటూ అదనపు ఆదాయం సంపాదించుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కె.సులోచనాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలు ఏర్పాటు చేయాలి

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ ఎస్.కోటలో ఐదు సచివాలయాలు ఉన్నా ఒక్కటే ఆర్‌బీకే ఉంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో నాలుగు ఆర్‌బీకేలు కేటాయించాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన గ్రామసభలో తీర్మానం చేశారు. స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో ఇన్‌చార్జ్ ఈఓ శ్రీనివాస్ నేతృత్వంలో సర్పంచ్ సంతోషికుమారి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ సంతోషికుమారి మాట్లాడుతూ పంచాయతీ నిధులతో కళింగెడ్డలో పూడికలు తీయించినట్లు చెప్పారు. ప్రస్తుతం జెడ్పీ నిధులతో పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డు, వన్‌వే జంక్షన్‌లో కల్వర్టు పనులు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోపాడ కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సులభతరం

వేపాడ: గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకు ఖాతాదారులు సీఎస్‌పీ (బ్యాంకు మిత్ర)ల వద్ద పాస్‌బుక్ ప్రింటింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నట్లు ఐరిక్స్ రాష్ట్ర ఇన్‌చార్జి చిరంజీవి అన్నారు. వేపాడ ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో కృష్ణారాయుడుపేట సీఎస్‌పీకు సంబంధించి పాస్‌బుక్ ప్రింటింగ్ మిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు బ్యాంకు వరకు వెళ్లకుండా గ్రామంలోనే సేవలు పొందేందుకు ప్రతీ సీఎస్‌పీకి ప్రింటింగ్ మిషన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. ఆర్‌డీలు, లైఫ్ ఇన్సూరెన్స్, సేవింగ్ పథకాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో చానల్ మేనేజరు కె.భానుచంద్రునాయుడు, మాధవరావు, పలువురు సిఎస్‌పిలు పాల్గొన్నారు.

రూ.1.04 కోట్లతో ముద్దానపేటకు బీటీరోడ్డు

దత్తిరాజేరు: పెదమానాపురం గ్రామ సచివాలయం నుంచి ముద్దానపేట(చినవంగర) గ్రామానికి రెండు కిలో మీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణానికి రూ.1.04 కోట్లు ఏపీఆర్ఆర్‌పీ నిధులు మంజూరైనట్లు డీఈ అప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. ఐదు దశాబ్దాలుగా గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించింది. 15 రోజులలో పనులు పూర్తి చేసి, బీటీరోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని డీఈ తెలిపారు.

21 నుంచి ఓటర్ల జాబితాల పరిశీలన



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్వో సుదర్శనదొర

కొత్తవలస: ఈనెల 21 నుంచి ప్రతీ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఈఆర్‌ఓ బి.సుదర్శనదొర తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు బూత్‌లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే కొత్త పోలింగ్ బూత్‌ల ఏర్పాటుపై చర్చించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, పోలింగ్ స్టేషన్ మార్పు, ఓటరు బదిలీ వంటివి పరిశీలించాక 2024 జనవరి 5న తుది జాబితాను ప్రచురణ చేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస మిశ్ర, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై వినతి

జామి: గ్రీన్ అంబాసీడర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు డేగల అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ గ్రీన్‌అంబాసిడర్లకు రూ.10వేలు వేతనం చెల్లించాలని, గుర్తింపుకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతన బకాయిలు చెల్లించాలని, వారినికి ఒకరోజు సెలవు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సత్వర సేవలకు 'జగనన్న సురక్ష'



గుర్ల: కుల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, సూర్యనారాయణరాజు



దత్తిరాజేరు: పెదకాదలో దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, అధికారులు



చీపురుపల్లి రూరల్: తాటిగూడలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



మెరకముడిదాం: గర్భాంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు

గుర్ల: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను ఉచితంగా అందిస్తున్నామని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు అన్నారు. మండలంలోని వల్లాపురం, పెనుబర్తి గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు, ఎంపీడీఓ కల్యాణి, డీటీ శోభ, సర్పంచ్ కృష్ణ, వైస్ సర్పంచ్ శ్రీరాములు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని పెదకాద సచివాలయంలో ఉపసర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో పాల్గొని 380 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. చినకాద సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు 120 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆవుగడ్డి ఈశ్వరమ్మ, వి.లక్ష్మునాయుడు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ గురుమూర్తి, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చీపురుపల్లి రూరల్(గరివిడి): ప్రజలకు ఉచితంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగా ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నామని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు అన్నారు. గరివిడి మండలంలోని తాటిగూడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఎడ్ల అప్పారావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, జేసీఎస్ కన్వీనర్ పొన్నాడ కుమార్, శంబాం, కోనూరు పీఏసీఎస్ అధ్యక్షులు లెంక శ్రీరాములు, ఎలకల అప్పలనాయుడు, వలిరెడ్డి లక్ష్మణ, కాంతారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరకముడిదాం: పేద ప్రజలకు మేలు చేకూర్చేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డి వేణుగోపాల్‌రావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, సత్తారు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గర్భాం, గాదెలమర్రివలస గ్రామాల్లో తహసీల్దార్ వియజభాస్కర్, ఎంపీడీఓ ఎం.రత్నం ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న వెంటనే అందించడం జరుగుతోందన్నారు.

పట్టణంలో సేవా కార్యక్రమాలు

చీపురుపల్లి: దివంతగ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని శనివారం నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, అనంతరం వృద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలంతా పాల్గొనాలని కోరారు.

బొత్స పుట్టినరోజు వేడుకలకు తరలిరావాలి

రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలను ఆదివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు కేక్ కటింగ్, అనంతరం మెగా వైద్యశిబిరం, ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. వెయ్యిమంది పేదలకు వస్త్రాలు పంపిణీ, భారీ అన్నసమారాధన చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పతివాడ రాజారావు, ఇప్పిలి సూర్యాప్రకాశ్, సువ్వాడ అప్పలనాయుడు, సూరు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్ ఆరోగ్యానికి హానికరం

బొండపల్లి: ప్రతి ఒక్కరూ జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ముఖ్యంగా విద్యార్థులు వాటి జోలికి పోవద్దని ఎన్‌సీబీసీసీ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ సూచించారు. మండలంలోని నెలివాడలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఎటువంటి ఆహారాన్ని తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎన్‌సీబీసీసీ ప్రతినిధులు

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పురుషోత్తమరావు, మహిళా పోలీస్ రామలక్ష్మి, పీఈటీ శేఖర్, గౌరిదేవి పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

● డీఆర్‌డీఏ అదనపు సంచాలకులు కె.సావిత్రి

గజపతినగరం: గ్రామీణ, మండల స్థాయిలో ఉన్న డ్వాక్రా సంఘాలన్ని తమ విధి విధానాల్లోను, అభివృద్ధిలోను ఎ గ్రేడులో ఉండాలని వైఎస్సార్ క్రాంతి పథం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అదనపు సంచాలకులు కె.సావిత్రి అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు రాయితీపై అందిస్తున్న రుణాలను సద్వినియోగం ఆర్థికంగా, సాంఘికంగా ఎదగాలని సూచించారు. ప్రతీ మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీపీఎం(చేయూత) బి.రవి, ఏరియా కోఆర్డినేటర్ జె.లక్ష్మునాయుడు, ఏపీఎం యు.జగదీష్‌కుమార్, స్త్రీనిధి ఏపీఎం రమేష్, ఏపీఎం(ఎస్‌వీఈపీ) ఇందిరాదేవి, ఏపీఎం ఎఫ్‌పీఓ ఎస్.సత్యవతి, మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ కె.సావిత్రి

విత్తనశుద్ధితో తెగుళ్లు దూరం

వరి విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేయడం వల్ల పంటను తొలిదశలో ఆశించే చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. వరి విత్తనాలు జల్లే సమయం కావడంతో శుక్రవారం పలు గ్రామాల రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. బొండపల్లి మండలం కొవ్వాడపేటలోని రైతులతో విత్తనాలు శుద్ధి చేయిస్తున్న ప్రకృతి వ్యవ



సాయ మండల కోర్డినేటర్ ఎం.రామకృష్ణ, సీఆర్పీ ఎం.రామ్మూర్తిని చిత్రంలో చూడొచ్చు. – బొండపల్లి

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: అర్హతే ప్రామాణికంగా.. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని గొట్లాం పంచాయతీ జియ్యన్నవలస, బారికపాలెం, రెడ్డిపేట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పి.సూర్యనారాయణమూర్తిరాజు (సురేష్‌బాబు)తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు ద్వారా నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించే బుక్‌లెట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలో ఏరాష్ట్రంలోనూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు వాటిని నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరవేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎక్కడా కూడా అవినీతి, అక్రమాలకు తావులేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు వస్తున్నాం..

గ్రామాల్లో ఉన్న ప్రతీ సమస్యను నేరుగా తెలుసుకుని, పరిష్కరించేందుకే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతీ గడపకు వచ్చి ప్రజా సమస్యలను తెలుసుకుంటామన్నారు. ఇప్పటికే కార్యక్రమం పూర్తయిన గ్రామాల్లో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. ఈ నిధులతో స్థానికంగా గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు.



'గడపగడపకు మన ప్రభుత్వం'లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

కోట్లాది రుపాయలతో అభివృద్ధి పనులు

నియోజకవర్గంలో ప్రతి మండలంలోనూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు ద్వారా గ్రామస్థాయిలోనే అన్ని సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో కూడా లేని విధంగా పారదర్శకంగా ప్రభుత్వ సేవలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభుజీ, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, తహసీల్దార్ డీజీఎంఎస్ఎన్ ప్రసాద్, ఎంపీడీఓ వైవీ రాజేంద్రప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల తులసీరాం, బోద్దల చిన్నం నాయుడు, గ్రామ సర్పంచ్ మండా ఆదిలక్ష్మి, మాజీ ఎంపీపీ బందారు బంగారం తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి

గజపతినగరం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను గజపతినగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు తెలిపారు. అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

దత్తిరాజేరు: దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మండలంలోని రాజుల రామచంద్రాపురంలో శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు తెలిపారు. పెదకాదలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

'జగనన్న సురక్ష'పై ప్రజలకు అవగాహన కల్పించాలి

చీపురుపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని, ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు అన్నారు. మండలంలోని నిమ్మలవలస, కర్లాం పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై శుక్రవారం గ్రామ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పతివాడ రాజారావు, సువ్వాడ అప్పలనాయుడు, స్థానిక నాయకులు అధికార్ల శ్రీనివాసరావు, చంద్రరావు, కృష్ణారావు, చింతాడ లక్ష్మణ, బాణాన శ్రీనివాసరావు, బాణాన రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ శుక్రవారం డ్రైడే..

శృంగవరపుకోట: వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్.కోట సబ్‌యూనిట్ అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని బాలాజీనగర్ ప్రాంతంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వ్యాధుల వ్యాప్తికి దోమలే ప్రధాన కారణమని, దోమలకు ఆవాసమైన మురుగునీటి నిల్వలు ఇంటి ఆవరణంలో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటీఎస్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ శంకర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



మురుగునీటి నిల్వలను తొలగిస్తున్న ఆరోగ్య సిబ్బంది

9న కంటి వైద్యశిబిరం

మెరకముడిదాం: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో ఈనెల 9న శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్పందన స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు సేవం వెంకటరమణ, పప్పల కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10న పకీరుకిట్టాలి సచివాలయం ప్రారంభం

గుర్ల: మండలంలోని పకీరుకిట్టాలిలో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఈ నెల 10న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు తెలిపారు. సచివాలయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

నేడే ప్రారంభం

కొత్తవలస: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతులమీదగా శనివారం ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయశాఖ ఏఓ శరణ్య శుక్రవారం ఒక ప్రకటణలో తెలిపారు. రూ.55 లక్షలతో నిర్మించిన ఈ కేంద్రంలో అన్ని సౌకర్యాలతో పాటు అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను ఈ ల్యాబ్‌లో పరిక్షిస్తారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

శృంగవరపుకోట: అంగన్‌వాడీ వర్కర్ల సమస్కలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్‌కు బడ్జెట్‌తో పాటు అంగన్‌వాడీ సిబ్బంది జీతాలు పెంచాలని, మిని సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, హెల్పర్లకు కార్యకర్తలుగా ప్రమోషన్లు కల్పించాలని, వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..!

మెరకముడిదాం: గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, చర్చకు టీడీపీ నాయకులు సిద్ధమా అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, సారిక తమ్మినాయుడు సవాల్ విసిరారు. మెరకముడిదాంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ అభివృద్ధిపై టీడీపీ నాయకులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సహకారంతో మండలంలోని అన్ని గ్రామాలకు రహదారులు నిర్మించామన్నారు. సోమలింగాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను నిర్మించింది ఎవరో టీడీపీ నాయకులకు తెలియదా.., ప్రతీ గ్రామంలో జగనన్న కాలనీలు, జగనన్న గృహకల్ప పథకాల ద్వారా సుమారు 1900 ఇల్లు వరకూ మంజూరు అయితే అందులో 15 వందల ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయని, అవి టీడీపీ నాయకులకు కనపడటం లేదా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు అవాకులు చావాకులు చెప్పినంత మాత్రాన నిజాలు అబద్దాలుగా మారిపోవని, చేసిన అభివృద్ధిని ఎవ్వరూ దాచిపెట్టలేరన్న విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తెరిగితే మంచిదని హితవు పలికారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఫెకర్ కార్మికుల నిరసన

చీపురుపల్లి: ఫెర్రో పరిశ్రమలు లేఆఫ్‌లు విధించకుండా కొనసాగించి కార్మికులను ఆదుకోవాలని గరివిడి ఫేకర్ జాయింట్ యాక్షన్ కమిటీ(ఎఫ్‌జేఏసీ) ప్రతినిధులు కోరారు. గరివిడి ఫేకర్ పరిశ్రమలో ఈ నెల 15 నుంచి లేఆఫ్ ప్రకటించిన నేపథ్యంలో ఎఫ్‌జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కంది రామారావు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి అంబల్ల గౌరునాయుడు మాట్లాడుతూ.. ఫెర్రో పరిశ్రమలు విద్యుత్ చార్జీల భారం పేరుతో లేఆఫ్‌లు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలు లేఆఫ్ ప్రకటిస్తే కాంట్రాక్టు కార్మికులు కుటుంబాలతో రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్ చార్జీలు తగ్గించి పరిశ్రమలు కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఉత్తరావల్లి ప్రకాష్, కుమరాపు వాసు, సీహెచ్‌విఎస్ఎమ్.రాజు, జి.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

సమన్వయంతోనే క్షేత్రస్థాయిలో అభివృద్ధి

చీపురుపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే క్షేత్రస్థాయిలో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. శాఖలు వారీగా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై, పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి, పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం జగనన్న సురక్ష కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం సూచించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజలు కోరిన వెంటనే వారికి అందేలా చూడాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసిందని, ఆ నిధులతో స్థానిక సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, తహసీల్దార్ ఎం.సురేష్, అన్నిశాఖల అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

గజపతినగరం రూరల్: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ కిషోర్‌కుమార్ తెలిపారు. మండలంలోని గంగచోళ్లపెంట గ్రామంలో శుక్రవారం హౌసింగ్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. బిల్లులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సంగమయ్య, ఎంపీటీసీ పైడన్న, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కొత్తవలస: జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ వై.పద్మజ అన్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి కుమ్మరిబంజిరి వద్ద ఉన్న జగనన్న లేఅవుట్‌లో శుక్రవారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో మౌలిక సౌకర్యాలన్నీ కల్పించామని, నిర్మాణం ప్రాప్తికి బిల్లులు కూడా చెల్లిస్తున్నామన్నారు. ఈ లేఅవుట్‌లో 96 మందికి ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం 36 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

వేపాడ: మండలంలోని వల్లంపూడి జగనన్న లేఅవుట్‌లో హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలని ఎంపీడీఓ బీఎస్ఎస్‌కే పట్నాయక్ లబ్ధిదారులకు సూచించారు. అవసరమైతే ఐకేపీలో రుణం తీసుకోవాలన్నారు. ఈ లేఅవుట్‌లో 69 మందికి, సొంత స్థలాలు కలిగిన 48 మందికి మొత్తం 117 ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 48 నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని హౌసింగ్ ఏఈ అప్పలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఓ శ్రీనివాసరావు, ఏఈలు ఆలీ, దివి, ఏపీఎం ఆదిలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయ్ పాల్గొన్నారు.